ఒకప్పుడు...ఒక కథ

'తాషా' కోటయ్య

వీధిచివర్న 'తాషా' చప్పుడు వినబడుతోంది!

కోటయ్య భార్య రంగి గుండె కుదుటబడింది. 'అమ్మయ్య క్షేమంగానే ఇంటికొస్తున్నాడన్నమాట' అనుకుంది.

కోటయ్య తాషా వాయించడంలో బ్రహ్మానందం పొందుతాడు.

అతని దరువు పాప నుంచి తాత వరకూ డ్యాన్స్ చేయాలనిపించేలా వుంటుంది.

తాషా-దుగ్గి-ఢక్కా-డోలూ ఏది పట్టుకున్నా అరక్షణంలో ఆ వాద్యం అతనిచే తాళ్లు బిగించుకుని, అంతవరకూ అది ధ్వనించిన శబ్దంకన్నా...అద్భుతమైన సొంపులు నేర్చుకుంటుంది. పెళ్లి బారాత్‌లూ- పొలిటికల్ ఊరేగింపులూ-గవర్నమెంట్ వాళ్ల సాంస్కృతికోత్సవాలు-మహానాయకుల అంతిమయాత్రలూ, దేవుళ్ల నిమజ్జనాలు..వగైరా కార్యక్రమాలకి కోటయ్య బృందం వెళ్లి కోలాహలం చేయాల్సిందే.

ఆరు పదులు దాటిన కోటయ్యకి ఏభై ఏళ్లపైనే తాషా వాద్యంలో అనుభవం ఉంది. ఆ వృత్తితోనే రంగి లాంటి మంచి పెళ్లాన్ని సంపాదించుకున్నాడు. ముగ్గురు పిల్లల్నీ చదివించి ప్రయోజకుల్ని చేసాడు. లోటు లేకుండా ఇల్లు గడుపుకొస్తున్నాడు.

"ఇంత వయస్సొచ్చాక తాషా కొట్టుకుంటూ ఊరూవాడా తిరగటం ఎందుకు? అసలే ఆరోగ్యం కూడా బాగాలేదు- ఓపికున్నన్నాళ్లు తిరిగావ్. ఇంక ఆ ఊరేగింపులు మానెయ్య"మని పిల్లలూ, భార్య ఆయన బైల్దేరుతున్నప్పుడల్లా అడ్డుపుల్లలు వేస్తుంటారు. వాళ్ల మాటలు కోటయ్య ఈ చెవితో విని ఆ చెవితో వదిలేస్తుంటాడు. తన దారి తనదే!

○○○

వినాయక చవితి బస్తీలో గొప్పగా చేస్తారు. వేలల్లో విగ్రహాలు టాంక్‌బండ్ దాకా ఊరేగుతూ, నీటిలో నిమజ్జనం అవుతుంటాయి! ఎన్ని వేలమంది 'బేండ్' వాళ్లో కావాలి. చవితెళ్లిన మూడోరోజూ, ఐదో రోజూ, తొమ్మిదో రోజూ...ఎంతమంది వాద్యగాళ్లున్నా..డిమాండ్ ఉంటుంది. 'డిమాండ్' బట్టి డబ్బా ఉంటుంది. పాతిక ముప్పై ఏళ్లుగా ప్రతీ సంవత్సరం వతనుగా వాయించే ఖాతాలు ఉన్నాయి కోటయ్య బృందానికి.

ముఖ్యంగా కోటయ్య తాషా అందరి వాద్యాల్లా..కాక కంచులా 'టంగ్' మంటున్నట్లుంటుంది. వాయించిన కొంతసేపు గింగుర్లు కొట్టినట్లు ప్రతిధ్వనిస్తుంది. సహవాద్యగాళ్లు ఆ ధ్వని రహస్యం తెలియక గిల గిల్లాడతారు.

ఎంత అడిగినా..చెప్పడానికి ఏవుందని..ఎవ్వరికీ ఏమీ చెప్పడు. తన తాషానీ ముట్టుకోనియ్యడు.

"కోటయ్యమావా ఏ కిటుకు వేస్తావు..నీ తాషాలా ఏదీ మోగదు-అలాటి చప్పుడు ఎలా వస్తుంది" అంటే.."పుల్లల్తో, టముకు టమా కొట్టడమేరా..మాయా మర్మంలేని వట్టి చర్మంరా తాషా- రగతం, మాంసం చర్మం అడుగున ఉంటే మనలాగే దీనికీ పొగరూ..నిషా...ఉంటాయి...అంతే తమాషా" అని మాట దాటేస్తాడుగానీ, ట్రిక్కేంటో చెప్పడు. అందరూ కోటయ్యని చాటుగా తిట్టుకుంటూంటారుగానీ అతని వాద్యాన్ని విద్యనీ మెచ్చుకుంటూంటారు.

చవితెళ్లిన మర్నాడు-పంచమి మధ్యాహ్నం జనగాంలో ట్రైనెక్కారు కోటయ్య బృందం...వారం పైనే కాంప్-

వాళ్లకి తెల్సున్న వాళ్లింట్లో దిగి స్నానాలు గట్రా చేసి..రోడ్డు మీద పడితే మళ్లీ మర్నాడు స్నానాల వేళకి వెళ్లటమే-

తొలిరోజు వాద్యాలు భుజాల మీద వేసుకుని అన్ని పందిళ్లలో దేవుళ్లనీ చూసి మొక్కి ప్రసాదానికి స్టేషను దగ్గర గణపతి దేవాలయానికి వెళ్లి సాయంత్రానికి ఓ నాలుగు గిరాకీలు సంపాదించారు.

రేపణ్నుంచి వరస ఆర్డర్లు బుక్ చేసుకోవటం- పని ప్రారంభించటం..ఎంత పెద్ద గణపతి బొమ్మంటే..ఊరేగింపు అంత నెమ్మదిగా సాగుతుంది. సాయంత్రం నాలుగు గంటలకి బొమ్మ ఎత్తితే..రస్తాని బట్టి అర్ధరాత్రి దాటుతుంది. చిన్న బొమ్మలైతే రోజుకి రెండు బేరాలు వప్పుకోవచ్చు.

ఎంత తిరిగినా చేతులూ కాళ్లూ నొప్పులు తెలియవు. ఊరేగింపుకి వచ్చిన జనం ఎంత బాగా ఆడితే తాషాలూ..దుగ్గిలూ అంత ఉత్సాహంగా మోగుతాయి. ఐదోరోజు ఊరేగింపులు పూర్తయ్యేసరికి ఒక వెయ్యి రూపాయలు జమ అయ్యాయి కోటయ్యకి- మందూ మాజా లేదు గనక..ఖర్చు అవట్లేదు..ఇంత డబ్బు పట్టుకుని ఈ రద్దీలో తిరగటం కష్టమే అనుకుంటున్నప్పుడు బాగా తెల్సున్న జనగాం కుర్రాడు ఒకడు కనిపించాడు రైలుకి వెళ్తూ! అతన్ని పలకరించి

"బాబూ ఈ వెయ్యి రూపాయలూ..మా రంగికిస్తావా" అంటూ తను నాల్గురోజుల్లో వస్తానని కబురు పెట్టాడు- మందులు వాడుతున్నానని చెప్పమని చెప్పాడు.

రెండు రోజులు ఖాళీలో..ఓ చావు మేళంలో 'తాషా' వాయించాల్సి వచ్చింది.

నిజానికి ఈ పండగ రోజుల్లో ఆ పని వప్పుకోడుగానీ..'వాద్యంతో ఉండగా వచ్చి అడిగితే కాదనకూడదు' అని తాతల్నాటి నుంచీ నమ్ముతూన్న సెంటిమెంట్.

ఆ రాత్రి బస ఉన్న వాళ్ల ఇంటికెళ్లి స్నానం చేశాడు. ఓ టీ తాగి పడుకున్నాడు.

తెల్లారేసరికి జ్వరం తగిలినట్లుంది..దగ్గూ కల్లీ మళ్లీ మొదలైపోయాయి.

బట్ల సంచీలో మందుల డబ్బా తీసుకున్నాడు. ఇక్కడ కొచ్చినప్పణ్నుంచీ నిజానికి మందుల ధ్యాసే మర్చిపోయాడు. అందుకోసమేమో..దేవుడు మొట్టికాయ వేసి మందుల డబ్బా గుర్తుచేసాడు.

రంగి బైల్దేరేముందు కన్నీళ్లెట్టుకుని చెప్పింది..."ఏళకింత ముద్దతిను- మందులు ఆపకుండా ఏసుకో-ఎళ్లద్దంటే మాట ఇనిపించుకోవు-నీకొచ్చింది చిన్నా సితకా జబ్బు కాదు-ఆర్నెల్లు జాగర్తగా ఉండాలి అన్నాడు డాట్టరుగారు.."

రంగి మాటలు గుర్తొచ్చాయి. ఆవేళ వాడాల్సిన

మందులు పొట్లం కట్టుకుని బైటకి బైల్దేరాడు.

దగ్గూ కల్లి ఉధృతంగా వస్తున్నాయి.

బండి దగ్గర ఇడ్లీ తిని, పొద్దున్న వాడాల్సిన మందులు మింగాడు.

జ్వరం ఎక్కువగా ఉంటే వాడమన్న మందు బిళ్ల కూడా మింగాడు.

పెరేడ్ గ్రౌండ్స్ దగ్గర కోటయ్య ట్రూప్ అంతా ఇతని కోసం ఎదురుచూస్తున్నారు.

దార్లో దగ్గుకి ఆగుతూ.. గొంతులోని కల్లి ఉమ్ముతూ అవస్థపడ్డాడు- బృందానికి తన జబ్బు తెలియకూడదని జాగ్రత పడుతున్నాడు. తెలిస్తే రైలెక్కించేస్తారు అని భయపడుతున్నాడు.

సాయంత్రానికి కల్లి రంగు ఎర్రగా మారింది. పాన్ తిన్నట్లు ఎర్రటి ఉమ్ము పదే పదే వస్తోంది.

మనసులో కంగారు మొదలైంది..తన పరిస్థితి అర్థం అయింది.

'ఇవ్వాళ చివరి ఊరేగింపు..నాకూ దేవుడికీ కూడా' అనుకున్నాడు.

అనుకున్నంతా అయింది-!!

ఉత్సాహంగా ఆడుతున్న భక్తుల్ని ప్రోత్సహిస్తూ, తాషా వాయిస్తూ దాన్లో దగ్గు కలిపేస్తూ..రంగుల బుక్కాల్తో రక్తం దాచిపెడుతూ..దేవుడితో బాటు..కోటయ్య కూడా నిమజ్జనానికి బైల్దేరాడు.



పెళ్లాం-పిల్లలూ-ఎవరూ గుర్తు రావట్లేదు. పాండవులకి తాము వెళ్లేది మహాప్రస్థానానికి అని తెల్సున్నట్లే..చనిపోతున్నానని తెలిసే యాత్ర సాగిస్తున్నాడు కోటయ్య నిర్మలంగా..నిశ్చలంగా..ధైర్యంగా..స్థైర్యంగా..

కోటయ్య తాదాత్మ్యంగా 'గణేష్ మహారాజ్‌కీ జై' అంటూ తన మెడలోని తాషా తీసి పుల్లల్తోబాటు తన బృందంలోని ఒకడికిచ్చి.."ఇది వాయించరా నేను దేవుడితో వెళ్తాను" అని క్రేన్‌లో పెట్టిన వినాయకుడి పాదాల దగ్గర నక్కి కూచ్చున్నాడు. అతని మాటలు వాళ్లకి అర్థం కాలేదు.

కోటయ్య పూలరాసిలో ఒదిగిపోయాడు.

బుక్కా రంగుల్తో పూలరంగుల్లో కలిసిపోయాడు.

పోలీసులూ..గార్డులూ అతన్ని గమనించకుండా అంత పెద్ద వినాయకుడి ముందు ఎలకలా దాక్కున్నాడు.

క్రేన్ నీటిలో దిగింది.

కోటయ్య పైకి తేలకుండా వినాయకుడి పాదాలు కావలించుకుని నిమజ్జనం అయిపోయాడు.

కోటయ్య ఇన్నాళ్లుగా ఎవరి చేతికీ ఇవ్వని 'తాషా'ని ముట్టుకుని పరిశీలిస్తూ..వాయిస్తున్న ఆనందంలో కోటయ్యని గమనించలేదు మిత్ర బృందం.

క్రేన్ పైకొచ్చిన కొంతసేపటికి..కోటయ్య శవం ఈతగాళ్ల కంటబడింది- పైకి తెచ్చారు.

తాషా వాదన ఆగింది. మిత్ర బృందం గొల్లుమన్నారు.

పంచనామాలూ..పోస్టుమార్టం లాంఛనంగా జరిపించి...

కోటయ్య దేహాన్ని మిత్రబృందానికి అప్పజెప్పారు.

ooo

'తాషా' శబ్దం ఇంటిముందు కొచ్చింది.

ఆ వెనక పాడెకి కట్టిన కో-ట-య్య-శవం!!

రంగి దుఃఖం రాయలేనిది-చెప్పలేనిది-చూడలేనిది-

"దేవుడా! వెళ్లిపోయావా? దేవుడితో వెళ్లిపోయావా? ఇలా నాకెందుకు కనిపిస్తున్నావయ్యా"

ఆవిడ బాధ వినలేనిది.

ooo

వస్తున్న మృత్యువుకి ఎదురెళ్లి స్వాగతించడానికి చాలా గుండె ధైర్యం వుండాలి. మరణానికి ముందే అనుబంధాలు తెంచుకోవడానికి చాలా ఆత్మస్థయిర్యం కావాలి! ఆ విరక్తుడు-జీవన్ముక్తుడు.

o